క్లుప్తంగా

ఇసుక అక్రమ తవ్వకాలను అరికట్టండి



వినతిపత్రం అందజేస్తున్న రైతులు

బొంరాస్‌పేట: మండల పరిధిలోని మహంతీపూర్ రైతులు ఇసుక అక్రమ తవ్వకాలను అరికట్టాలని కోరుతూ బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. గ్రామశివారులో ఉన్న కాగ్నావాగు, వ్యవసాయ పొలాల నుంచి ఇసుక అక్రమరవాణా కొన్నేళ్లుగా సాగుతోందని, భూగర్భజలాలు అడుగంటి వ్యవసాయ బోర్లు దెబ్బతినే ప్రమాదం ఉందని వాపోయారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించి సత్వర చర్యలు చేపట్టాలని వినతిపత్రంలో కోరారు.

తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న నాయకులు

దుద్యాల్: మండలానికి బదిలీపై వచ్చిన తహసీల్దార్ బి వెంకటేశ్ ప్రసాద్‌ను మండల యూత్ కాంగ్రెస్ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రజలందరికి అందుబాటులో ఉండి సేవలందిస్తానని తెలిపారు. సన్మానించిన వారిలో శ్రీకాంత్, లక్ష్మణ్, గోపాల్, అమీర్, విజయ కుమార్, గణేశ్ తదితరులు ఉన్నారు.

'గీతా సత్సంగ్' కార్యవర్గం నియామకం



గీతా సత్సంగ్ సేవా సమితి కార్యవర్గం

తాండూరు టౌన్: గీతా సత్సంగ్ సేవా సమితి తాండూరు నూతన కార్యవర్గాన్ని గురువారం ఆమనగల్ పీఠాధిపతి శివానంద స్వామి ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. సమితి గౌరవాధ్యక్షుడిగా భగవాన్ దాస్ అగర్వాల్, అధ్యక్షుడిగా చల్ల నారాయణ, ఉపాధ్యక్షుడిగా కొకుంట్ల వాసు, రొంపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా దేవగారి రమేష్‌కుమార్, సహాయ కార్యదర్శిగా చాగి రాఘవేందర్, పోలా బిచ్చయ్య, కోశాధికారిగా ఆకుల కృష్ణయ్య, దూళ్ల ప్రభాకర్ రెడ్డితో పాటు పలువురు ముఖ్య సలహాదారులను నియమించారు. సమితి మహిళా అధ్యక్షురాలిగా ఆడికె సరిత, కార్యదర్శిగా బండారి పుష్పమ్మ, కోశాధికారిగా గుముడాల సువర్ణలను నియమించారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



ఆహారం తినిపిస్తున్న సూపర్‌వైజర్ ఉజ్వల

దోమ: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉండొచ్చని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఉజ్వల సూచించారు. బుధవారం దోమ మండల పరిధిలోని బట్లచందారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మహోత్సవ కార్యక్రమాన్ని టీచర్ అనంతతో నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం పోషణ మహోత్సవాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి లబ్ధిదారులకు సిలిండర్లు

బషీరాబాద్‌లో 5,786 మంది ఎంపిక

బషీరాబాద్: మహాలక్ష్మి పథకం కింద లబ్ధిదారులకు రూ.500లకే ప్రభుత్వం గ్యాస్ సిలిండర్లను అందజేస్తుంది. మొదటి దఫా ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులకు బషీరాబాద్ మండలం నుంచి 5,786 మంది ఎంపికయ్యారు. గ్యాస్ కంపనీలకు మొత్తం ధర చెల్లిస్తే రూ.500 సబ్సిడీ డబ్బులను నాలుగు రోజుల్లో లబ్ధిదారుల ఖాతలో జమచేస్తుంది. ప్రభుత్వ నిర్ణయంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జాబితాలో పేర్లు లేని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాము దరఖాస్తు చేసుకున్నా జాబితాలో పేరు లేదని ఎంపీడీవో, గ్యాస్ కంపనీల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి త్వరలో మంజూరవుతాయని చెబుతు న్నారు.

నేడు ఎమ్మెల్యే పంపిణీ

మహాలక్ష్మీ పథకం కింద మంజూరు చేసిన గ్యాస్ సిలిండర్లను గురువారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో విజయ్‌కుమార్ పేర్కొన్నారు.

నిమజ్జనం ఆగమాగం!

- నీటిలో మునగని గణపతి విగ్రహాలు
- ఇష్టానుసారంగా పడవేత
- పట్టించుకోని అధికారులు



ఎబ్బనూర్ చెరువులో నీటిపై తేలిన విగ్రహాలు



చెరువు ఒడ్డునే పేరుకుపోయిన చెత్తాచెదారం

ధారూరు: నిండుకుండలా చెరువులు ఉన్నప్పటికీ గణపతి విగ్రహాలను నిమజ్జనం చేయడంలో మండపాల నిర్వాహకుల్లో అశ్రద్ధ, నిర్లక్ష్యం కొట్టొచినట్టు కనిపిస్తోంది. నిమజ్జనం సందర్భంగా స్థానిక చెరువులో ఇష్టానుసారంగా పడేశారు. ఈ విషయాన్ని పట్టించుకునే వారు కరువయ్యారు. ధారూరు–వికారాబాద్ వయా ఎబ్బనూర్ మార్గంలోని చెరువులో వికారాబాద్ పట్టణానికి చెందిన వినాయక విగ్రహాలను మండపాల నిర్వాహకులు, భక్తులు మంగళవారం రాత్రి వరకు నిమజ్జనం చేశారు. దీంతో అక్కడ ఉన్న చెరువు నీటిలో చెత్తాచెదారం పేరుకుపోయాయి. ఈ చెత్తతో అక్కడ పరిసరాలు కలుషితమవ్వడమే కాకుండా చెరువు నీరు పాడవుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందులో పెంచుతున్న చేపలు సైతం చనిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లోతుగా ఉండే ప్రదేశంలో వేయకుండా ఒడ్డున పడేయడంతో అవీ నీట మునగకుండా తేలాయి. దీంతో చెరువు వద్ద పేరుకపోయిన చెత్తచెదారం వల్ల కలుషితమైన నీటిని పశువులు, మేకలు, గొర్రెలు తాగితే వ్యాధుల బారిన పడే ప్రమాదం లేకపోలేదు. ఇప్పటికైనా ఈ విషయాన్ని సంబంధిత అధికారులు గమనించి వెంటనే చెత్తాచెదారాన్ని బయటకు తీసివేయించాలని వారు కోరుతున్నారు.

సమాజ నిర్మాతలు గురువులే



తాండూరు రూరల్: ఉత్తమ ఉపాధ్యాయులతో డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్, ఎంఈవో వెంకటయ్య

- డీసీసీబీ వైస్ చైర్మన్ సంగెం రవిగౌడ్ ఎంఈవో వెంకటయ్య
- ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఎంపీడీవో

తాండూరు రూరల్: విద్యార్థులను సమాజ నిర్మాతలుగా తీర్చిదిద్దేవారు ఉపాధ్యాయులేనని డీసీసీబీ వైస్ చైర్మన్ సంగెం రవిగౌడ్, ఎంఈఓ వెంకటయ్య పేర్కొన్నారు. బుధవారం 21 మంది ఉత్తమ ఉపాధ్యాయులను వారు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యాబోధన అందించినప్పుడే ప్రజల్లో మంచి గుర్తింపు వస్తుందన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులు సమాజాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దగలరని అభిప్రాయపడ్డారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులకు శాలువ కప్పి, పూలమాలలు వేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విశ్వప్రసాద్, పీఆర్టీయూ, యూటీఎఫ్, టీపీయూఎస్, జీటీఏ ఉపాధ్యాయ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రవిగౌడ్‌కు సన్మానం

డీసీసీబీ వైస్ చైర్మన్‌గా ఎన్నికైన సంగెం రవిగౌడ్‌కు వివిధ ఉపాధ్యాయ సంఘం నాయకులు శాలువ కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.

మోమిన్‌పేట: సమాజంలో గురువులు పూజనీయులని ఎంపీడీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లిదండ్రులతో సమానంగా గురువులను కూడా సమాజంలో పూజిస్తారని అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా సన్మానించిన వారిపై మరింత బాధ్యత పెరుగుతుందని చెప్పారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే అవకాశం కేవలం గురువులకే ఉందన్నారు. విద్యార్థులను సన్మార్గంలో నడిపించి, ఉత్తములుగా ఎదిగేందుకు ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. అంతకుముందు 16మంది ఉత్తమ ఉపాధ్యాయులకు పూలమాలలు వేసి, శాలువా కప్పి ప్రశంసా పత్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి పూర్ణచందర్‌రావు, తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, ఎంఈఓ గోపాల్, ఎంపీఓ యాదగిరి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బంట్వారం: బంట్వారంలోని తెలంగాణ మాడల్ స్కూల్, కళాశాల హెచ్‌బీటీ ఉపాధ్యాయుల నియామకానికి సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ బ్యూలా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీటీకి గాను పీజీతో పాటు బీఈడీ పాసై ఉండాలన్నారు. తెలుగు, ఇంగ్లీష్ 2, మ్యాథ్స్ 2, ఫిజిక్స్, బాటని, సివిక్స్, టీజీటీ హిందీ సబ్జెక్టుల్లో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు రెండు రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు.

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా సరళ



ప్రిన్సిపాల్ సరళ

పూడూర్: పూడూర్ మండలంలోని ఎంకేపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్‌గా సరళ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహించిన శ్రీదేవి బంట్వారం మండల కేంద్రానికి బదిలీ అయ్యారు. బంట్వారంలో విధులు నిర్వహించిన సరళ ఇక్కడికి బదిలీపై వచ్చారు.

సబ్సిడీ గ్యాస్ సిలిండర్ పత్రాలు అందజేత



పత్రాలు అందజేస్తున్న నాగరాజు తదితరులు

బొంరాస్‌పేట: కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో మహాలక్ష్మి పథకం గ్యాస్ సిలిండర్ సబ్సిడీని మంజూరు చేస్తోందని మండల కాంగ్రెస్ పార్టీ మాజీ ఉపాధ్యక్షుడు చంద్రప్ప అన్నారు. బుధవారం మండలంలోని ఉమ్మడి రేగడిమైలారం గ్రామపంచాయతీలోని 400మంది గ్యాస్ సిలిండర్ వినియోగదారులకు ప్రభుత్వం నుంచి రూ.500లకే వంటగ్యాస్ సిలిండర్ అందించే పత్రాలను పంచాయతీ కార్యదర్శి నాగరాజు, పార్టీ నాయకులు అందజేశారు. ఇందులో ఏమైనా సమస్యలుంటే 1967 టోల్‌ఫ్రీ నంబర్ లేదా 18004250033కు కాల్ చేసి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీల కార్యదర్శులు రవినాయక్, చైతన్య, నాయకులు వెంకట్‌రెడ్డి, వెంకటయ్య, ప్రసాద్‌గౌడ్, విశ్వనాథం, విష్ణువర్ధన్, అశోక్‌రెడ్డి, చందర్, మోత్యా తదితరులున్నారు.

పారిశుద్ధ్యంపై అవగాహన



మోమిన్‌పేట: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



తాండూరు టౌన్: స్వచ్ఛతా హీ సేవలో కౌన్సిలర్ వెంకన్న గౌడ్, కాలనీవాసులు

పలు కాలనీల్లో ర్యాలీలు

తాండూరు టౌన్: తాండూరు పట్టణ శివారులోని రాజీవ్ కాలనీ, ఇందిరమ్మ కాలనీల్లో బుధవారం స్థానిక కౌన్సిలర్ వెంకన్న గౌడ్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయొద్దన్నారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులతో కలిసి కాలనీల్లో ర్యాలీ నిర్వహించారు.

కందనెల్లిలో స్వచ్ఛత ర్యాలీ



పెద్దేముల్: కందనెల్లి గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పెద్దేముల్: కందనెల్లి గ్రామంలో బుధవారం పంచాయతీ అధికారులు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. చౌరస్తాలో మానవహారం అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ప్రతిఒక్కరూ వ్యక్తి గత పరిశుభ్రత, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీఓ రతన్‌సింగ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివకుమార్, పంచాయతీ కార్యదర్శి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మోమిన్‌పేట: ప్రతి గ్రామం స్వచ్ఛతను చాటాలని, గాంధీజీ కలలను సాకారం చేయాలని మండల ప్రత్యేకాధికారి పూర్ణచందర్‌రావు పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో స్వచ్ఛతాహి సేవ పక్షోత్సవాల సందర్భంగా మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఇంటి శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. గ్రామాల్లో మొక్కలను విరివిగా పెంచి, వాటిని సంరక్షించాలన్నారు. వారానికి 2గంటలు పరిశుభ్రత కోసం కేటాయించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంపీఓ యాదగిరి, ఏపీఓ శంకర్, ఏపీఎం రాజు, కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది, వీపీఓలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత



అనంతగిరి: కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

అనంతగిరి: వికారాబాద్ మండలంలోని అత్వెల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న అనిల్ ఇటీవల మృతి చెందారు. మృతుడు పీఆర్టీయూలో సభ్యత్వం ఉన్నందున వారి కుటుంబానికి రూ.లక్ష చెక్కును బుధవారం జిల్లా అధ్యక్షుడు కడియాల చంద్రశేఖర్‌తో పలువురు పీఆర్టీయూ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కేదార్‌నాథ్, ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, బాబ్యా నాయక్, వీరకాంతం, మహేందర్‌రెడ్డి, బస్వరాజు, మాణిక్యం, శ్రీనివాస్, రాజశేఖర్, కిష్టారెడ్డి, అశోక్, మహేందర్, అంజిరెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు అండగా ఉంటా

దోమ: పేద కుటుంబాలకు అండగా ఉంటానని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పట్లోళ్ల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం గుండాల గ్రామానికి చెందిన అంజిలమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఆయన మృతదేహానికి నివాళులర్పించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఎలాంటి కష్టం ఎదురైనా తను అండగా ఉంటానన్నారు. మాజీ వార్డు సభ్యుడు చెన్నయ్య, దస్తయ్య, చిన్నయ్య, మల్లేశం గౌడ్, బాబు, చంద్రప్ప, శివప్ప, అంజిలయ్య, నర్సింహారెడ్డి, మల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

తహశీల్దార్ విజయ్‌కుమార్



తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న కుటుంబీకులు నారాయణ, విజయ్‌కుమార్

బంట్వారం: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకుంటున్నామని తహశీల్దార్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మర్పల్లి మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన ఓ బాధిత రైతు తహశీల్దార్‌ను కలిసి సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ యాచారం రెవెన్యూ పరిధిలోని 28 సర్వే నంబర్‌లో 3ఎకరాల 13 గుంటల పట్టా భూమికి సంబంధించిన కుటుంబీకులు ఫిర్యాదు చేశారన్నారు. ఈ పట్టా భూమికి సంబంధించి యాచారానికి చెందిన బుజ్జమ్మ, అంతమ్మల పేర్లు ధరణిలో పొరపాటున నమోదై ఉందన్నారు. అసలు పట్టాదారులుగా హన్మయ్య, సాయన్న, బాలయ్య, మల్కయ్యలు ఉన్నట్లుగా రికార్డులో ఉందని ఆయన వివరించారు. ఈ విషయంలో సత్వరమే అసలు హక్కుదారులకు న్యాయం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ మహేష్‌కుమార్, బాధిత కుటుంబ సభ్యులు నడిమిదొడ్డి నారాయణ, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

కేరెళ్లిలో రూ.1.31లక్షలు పలికిన లడ్డూ



దోమ: వేలంలో లడ్డూ దక్కించుకున్న ఇంతియాజ్

ధారూరు: ధారూరు మండల పరిధిలోని కేరెళ్లి గ్రామంలో మంగళవారం రాత్రి నిర్వహించిన లడ్డు వేలంలో రైతు అల్లమన్నోళ్ల రాజేందర్‌రెడ్డి దక్కించుకున్నారు. పోటాపోటీగా సాగిన వేలంలో ఆయన రూ.1.31లక్షల వరకు పాడి కైవసం చేసుకున్నారు. ఈ లడ్డూను కొంత పొలంలో చల్లి, మిగిలింది పంచిపెడతానని రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేరెళ్లి ఉత్సవ కమిటీ నాయకులు శివకుమార్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బొంపల్లిలో వేలంలో లడ్డూ దక్కించుకున్న ముస్లిం యువకుడు

దోమ: నవరాత్రుల పూజలు అందుకున్న వినాయకుడిని గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. దోమ మండలం బొంపల్లి గ్రామంలోని బంక కాలనీలో 12 రోజులుగా పూజలు నిర్వహించి బుధవారం నిమజ్జన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా లడ్డూ వేలం నిర్వహించగా బొంపల్లి గ్రామానికి చెందిన ముస్లిం యువకుడు ఇంతియాజ్ రూ.32వేలకు దక్కించుకున్నాడు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో అభివృద్ధి పనులు: ఎమ్మెల్యే

తాండూరు: తాండూరు మున్సిపాలిటీకి మంజూరైన నిధులను పక్కా ప్రణాళికతో అభివృద్ధి పనుల కోసం వెచ్చించాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడి పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తాండూరు మున్సిపల్ అధికారులతో పాటు పలు శాఖలకు చెందిన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తాండూరు పట్టణంలోని చిలుక వాగు ప్రక్షాళన పనులను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నట్లు చెప్పారు. దీనికోసం అధికారులు సమిష్టిగా పనులు చేయాలన్నారు. కాగ్నానది నుంచి పట్టణానికి తాగునీటి సరఫరాకు పైప్‌లైన్, చెక్ డ్యాంల నిర్మాణానికి పూర్తి స్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేయాలని కమిషనర్ విక్రమ్ సింహారెడ్డిని ఆదేశించారు. తాండూరు పట్టణ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి నిధులు విడుదల చేసేందుకు సానుకూలంగా ఉన్నారన్నారు. ఈ సమీక్షా సమావేశంలో డీఈలు సాజిద్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.


బాల్య వివాహాలను అరికట్టండి



కుల్కచర్ల బాలికల పాఠశాలలో అవగాహన ర్యాలీ

కుల్కచర్ల: బాల్య వివాహాలను అరికట్టాలని పలు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. ప్రతీ అమ్మాయికి తప్పనిసరిగా 18సంవత్సరాలు నిండిన తర్వాతే పెళ్లిళ్లు చేయాలన్నారు. సాధన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బాలికల పాఠశాల, కేజీబీవీ, శ్రీరామలింగేశ్వర, వివేకానంద కళాశాలలో బాల్యవివాహాలను అరికట్టాలని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బాల్యంలోనే అమ్మాయిలకు పెళ్లిళ్లు చేస్తే శారీరక, మానసిక ఎదుగుదల లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనవలసి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సాధన సంస్థ ప్రతినిధులు నర్సింలు, సంజమ్మ, రాంచంద్రయ్య, గౌస్ పాష, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో స్వచ్ఛభారత్ అభియాన్



స్వచ్ఛభారత్ అభియాన్‌లో పాల్గొన్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

చేవెళ్ల: సమాజంలో ప్లాస్టిక్ వినియోగం రోజురోజుకు పెరిగిపోతుందని దీంతో భూ ప్రపంచానికి నష్టం వాటిల్లుతోందని ఏబీవీపీ నగర కార్యదర్శి మహిపాల్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఏబీవీపీ స్టూడెంట్ ఫర్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ ఫ్రీ క్యాంపస్, స్వచ్ఛభారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులతో కలిసి కళాశాల ఆవరణలో ఉన్న చెత్తచెదారాలను శుభ్రం చేశారు. ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వస్తువులు, ఖాళీ వాటర్ బాటిళ్లను, కవర్లను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా డస్ట్‌బిన్‌లో వేయాలని చెప్పారు. ఇలా ఒక చోటు వేసిన ప్లాస్టిక్‌ను రీసైక్లింగ్ లేదా కాల్చివేస్తారని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరుతూ కళాశాల ఆవరణ మొత్తం శుభ్రం చేశారు. అనిల్, శివ, నితీశ్, ప్రణయ్, హీరాక్, అఖిల, ప్రవళిక, సంధ్య పాల్గొన్నారు.